ప్రజాశక్తి
శనివారం 23 నవంబర్ 2024 5 అనంతపురం



ఆర్టీసీ కడప జోనల్ ఛైర్మన్‌గా పూల నాగరాజు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-అనంతపురం



నాగరాజును అభినందిస్తున్న ఎంపీ అంబికా

ఆర్టీసీ కడప జోనల్ ఛైర్మన్‌గా పూల నాగరాజు శుక్రవారం అనంతపురం ఆర్టీసీ ప్రాంగణంలోని జోనల్ ఛైర్మన్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. పూల నాగరాజు ప్రమాణ స్వీకారానికి ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి పెద్దఎత్తున టిడిపి నాయకులు కార్యకర్తలు హాజరయ్యారు. అనంతపురం పార్లమెంటు సభ్యుడు అంబికా లక్ష్మీనారాయణ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(కడప జోన్) చంద్ర శేఖర్, రీజినల్ మేనేజర్ సుమంత్, ఆర్.ఆదోని, పుట్టపర్తి డిపిటిఒ మధుసూదన్, మాజీ జడ్పీటీసీలు రామలింగారెడ్డి, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు. బాధ్యతల స్వీకరణ అనంతరం పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

వేడుకగా స్నాతకోత్సవం



విద్యార్థినికి డిగ్రీ పట్టాను అందజేస్తున్న ఛాన్సలర్ చక్రవర్తి

- ముఖ్యఅతిథిగా యూఎస్ నేషనల్ సైన్స్ ఫౌండేషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ సేతు రామన్ పంచనాథన్
- 22 మందికి బంగారు పతకాలు
- 14 మందికి డాక్టరేట్



స్నాతకోత్సవం లో మాట్లాడుతున్న సేతురామన్ పంచనాథన్.

శ్రీ సత్యసాయి ఇన్స్టిట్యూట్ ఆఫ్ హైయర్ లర్నింగ్ 43వ స్నాతకోత్సవ వేడుకలు శుక్రవారం నాడు వేడుకగా జరిగాయి. ముఖ్యఅతిథిగా యూఎస్ నేషనల్ సైన్స్ ఫౌండేషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ సేతు రామన్ పంచనాథన్ హాజరయ్యారు. స్నాతకోత్సవం సందర్భంగా పుట్టపర్తిలో సందడి వాతావరణం నెలకొంది. సత్యసాయిబాబా జయంతికి ఒక రోజు ముందు స్నాతకోత్సవం నిర్వహించడం అనవాయితీగా వస్తోంది. అందులో భాగంగా ప్రశాంతి నిలయంలోని పూర్ణచంద్ర ఆడిటోరియంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్నాతకోత్సవానికి ముందు హైయర్ లర్నింగ్ విద్యార్థులు ట్రస్ట్ సభ్యులు, అధ్యాపక బందాన్ని ప్రత్యేక కవాతు ద్వారా వేదిక వద్దకు వద్దకు తీసుకుని వచ్చారు. ముఖ్య అతిథి ప్రసంగం అనంతరం విద్యార్థులకు బంగారు పథకాలు, డాక్టరేట్లను ప్రదానం చేశారు.

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్


పరిశోధనలు.. సేవతో ప్రపంచ గుర్తింపు

శ్రీ సత్యసాయి ఇన్స్టిట్యూట్ ఆఫ్ హైయర్ లర్నింగ్ యూనివర్సిటీ విద్యార్థులు చేస్తున్న పరిశోధనలు, సేవా కార్యక్రమాలు ప్రపంచ స్థాయి గుర్తింపును తెచ్చి పెడుతున్నాయనియూఎస్ నేషనల్ సైన్స్ ఫౌండేషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ సేతురామన్ పంచనాథన్ పేర్కొన్నారు. 43వ స్నాతకోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ సత్యసాయి విశ్వవిద్యాలయంలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు చేస్తున్న పరిశోధనలు ప్రపంచస్థాయి గుర్తింపుని తెచ్చిపెడుతున్నా యన్నారు. అదే స్థాయిలో విద్యార్థులు చేస్తున్న సేవలు అమోఘం అని కొనియాడారు. సత్యసాయి బాబా మానవతా విలువలతో కూడిన విద్యను అందించేందుకు విద్యాసంస్థలను స్థాపించారన్నారు. ఈ విద్యా సంస్థల ద్వారా ఉత్తమ విలువలను కలిగిన విద్యార్థులను ప్రపంచానికి అందజేస్తున్నారని చెప్పారు. సత్యసాయి బాబా ఆశయాలు, సేవలను కొనసాగిస్తూ విద్య, వైద్య, ఆధ్యాత్మిక విభాగాల ద్వారా ట్రస్ట్ చేపడుతున్న సేవలు అభినందనీయం అన్నారు. సత్యసాయిబాబా ఆశయ సాధన కోసం విద్యార్థులు చేస్తున్న కృషి తదుపరి తరాలకు ఆదర్శనీయం అన్నారు. అనంతరం భగవాన్ సత్యసాయి బాబా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడిన మాటలను వీక్షణ పరికరాల ద్వారా వినిపించారు. వైస్ ఛాన్సలర్ రాఘవేంద్రప్రసాద్ విశ్వవిద్యాలయం పురోగతిని ప్రదర్శిస్తూ వార్షిక నివేదికను సమర్పించారు. ఈ కార్యక్రమంలో శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యుడు ఆర్‌జె.రత్నాకర్, ట్రస్టీ ఎస్ఎస్.నాగానంద్, టికెకె.భగవత్, డాక్టర్ మోహన్, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, యూనివర్సిటీ వైస్ ఛాన్సర్, రిజిస్టర్, డీన్, అధ్యాపక బందం, విద్యార్థులు పాల్గొన్నారు.

22 బంగారు పథకాలు.. 14 పిహెచ్‌డిలు

సత్యసాయి విశ్వవిద్యాలయంలో 463 మంది విద్యార్థులు డిగ్రీల్లో ప్రవేశం పొందారు. వీరిలో వివిధ విభాగాల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు బంగారు పథకాలను అందజేశారు. స్నాతకోత్సవం సందర్భంగా వీరిలో 22 మందికి బంగారు పథకాలు, 14 మందికి పిహెచ్‌డిలను శ్రీ సత్యసాయి విశ్వవిద్యాలయ ఛాన్సలర్ చక్రవర్తితో పాటు వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ రాఘవేంద్రప్రసాద్ అందజేశారు.

నేడు బాబా జయంతి ఉత్సవాలు | ముఖ్య అతిథిగా గవర్నర్



శ్రీసత్యసాయిబాబా 99వ జయంతి వేడుకలు గురువారం నాడు ప్రశాంతి నిలయంలో వైభవంగా జరగనున్నాయి. వేడుకల నిర్వహణ ఏర్పాట్లను అధికారులు, ఇప్పటికే సత్యసాయి సెంట్రల్ ట్రస్టు ఆధ్వర్యంలో పూర్తి చేశారు. సత్యసాయి జయంతి ఉత్సవాల్లో ముఖ్య అతిథిగా పాల్గొనేందుకు శుక్రవారం రాత్రే రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ పుట్టపర్తికి చేరుకున్నారు. శనివారం సాయికుల్వంత్ హాల్లో బాబా మహాసమాధిని దర్శించుకోనున్నారు. అనంతరం నిర్వహించే బాబా వేడుకల్లో ఈయన పాల్గొని మాట్లాడనున్నారు. జయంతి వేడుకల్లో భాగంగా ఉదయం ప్రశాంతి నిలయంలోని సాయి కుల్వంత్ హాల్లోని సభ మండపంలో ప్రశాంతి భజన బందం చేత గురువందనం కార్యక్రమం నిర్వహించనున్నారు. సాయంత్రం నాలుగు గంటలకు స్వర్ణ రథాన్ని ఊరేగింపు జరగనుంది. అనంతరం జోళి మహోత్సవం ఉంటుంది. మల్లాది సోదరుల సంగీత విభావరి కార్యక్రమం జరుగుతుంది. జయంతి వేడుకల సందర్భంగా వైద్యశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక చికిత్స కేంద్రాలను ఏర్పాటు చేశారు. మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో వీధి దీపాలు, తాగునీరు, విచారణ కేంద్రాలు, పారిశుధ్యం, మరుగుదొడ్లు, పార్కింగ్ ప్రదేశాలు, ఏర్పాటు చేశారు. భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సులను నడపనున్నారు. సాయి భక్తుల ఆధ్వర్యంలో పుట్టపర్తి ప్రధాన విధులను పచ్చని తోరణాలతో అలంకరించారు. భవనాలను విద్యుత్ కాంతులతో నింపారు. సత్యసాయి బాబా జయంతి సందర్భంగా స్థానిక భక్తుల సైతం అన్నదాన కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రసాదాలను పంపిణీ చేయనున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా ఎస్పీ వి.రత్న ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బలగాలతో బందోబస్తు చర్యలు చేపట్టారు. జయంతి వేడుకలకు దేశ విదేశీ భక్తులు పుట్టపర్తికి చేరుకోవడంతో పుట్టపర్తి పురవీధుల్లో పండుగ వాతావరణం నెలకొంది.

అడ్డుగోలు అమిగోస్..!

◆ ప్రతిపక్షంలో ఉండగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ ◆ ఇప్పుడేమో ఆ సంస్థకే మద్దతు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి



భూగర్భ ఖనిజాలకు రాయల్టీ కట్టే కాంట్రాక్టును చేపట్టిన అమిగోస్ సంస్థ అడ్డగోలుగా వ్యవహరిస్తున్నా పాలకులు మౌనంగా ఉండటం అనేక విమర్శలు, ఆరోపణలకు తావిస్తోంది. ప్రతిపక్షంలో ఉండగా ఆ సంస్థపై విచారణ చేపడతామని హెచ్చరించిన వారు... అధికారం వస్తూనే మిన్నకుండిపోయారు. ఇప్పటికీ ఆ సంస్థ రాయల్టీ వసూళ్లలో అడ్డుగోలుగానే వ్యవహరిస్తున్నారు. ప్రజల నుంచి ముక్కుపిండి రాయల్టీలను వసూలు చేస్తున్న ఆ సంస్థ ఇప్పటికీ ప్రభుత్వానికి మాత్రం డబ్బులు చెల్లించలేదు. అయినా దానిపై అధికారులు మౌనంగా ఉండటం గమనార్హం.

అమిగోస్ కథ ఇది

భూగర్భ ఖనిజాల నుంచి రాయల్టీలను 2023 మార్చి ముందు వరకు భూగర్భ గనుల శాఖ వసూలు చేసేది. దీని ద్వారా ప్రభుత్వానికి ఆదాయం రావడం లేదని, ప్రయివేటుకు కాంట్రాక్టు ఇస్తే ఎక్కువ ఆదాయం సమకూరుతుందని భావించి 2023 మార్చి నుంచి అమిగోస్ సంస్థకు రెండేళ్ల కాల వ్యవధితో కాంట్రాక్టును ఇచ్చారు. నెలకు రూ.11 కోట్లు రాయల్టీ డబ్బులను వసూలు చేసి ప్రభుత్వానికి జమ చేయాలి. సకాలంలో రాయల్టీ డబ్బులను చెల్లించకుంటే 24 శాతం వడ్డీతో చెల్లించాలి. కాని ఆ సంస్థ ఇప్పటి వరకు డబ్బులు చెల్లించకుండా ఉన్నట్టు ఆరోపణలున్నాయి. సుమారు రూ.150 కోట్లకుపైగా బకాయి ఉంది. అయినా ప్రభుత్వం, అధికారులు ఎటువంటి చర్యలూ తీసుకోవడం లేదన్న ఆరోపణలున్నాయి.

అడ్డుగోలుగా డబ్బులు వసూళ్లు

అమిగోస్ ప్రభుత్వానికి డబ్బులు చెల్లించడం లేదుగానీ సామాన్యుల మొదలుకుని క్వారీల వరకు అందరి నుంచి ముక్కుపిండి ఫెనాల్టీలు, రాయల్టీల రూపంలో డబ్బులను ఆ సంస్థ వసూలు చేస్తోంది. గతంలో ఇదే రకంగా వసూలు చేసే క్రమంలోనే అప్పటి వైసిపి అధికారపార్టీ కౌన్సిలర్‌కు సంబంధించిన ఒక ఎక్స్‌వేటర్‌ను దౌర్జన్యంగా తీసుకెళ్లడం విషయం వివాదం కావడంతో సర్దుబాటు చేసుకున్నారు. కంచేచేను మేసిందన్న చందంగా అందులో పనిచేసే ఉద్యోగులు కొందరు వారే మైనింగ్‌లను అనుమతుల్లేకుండా చేపట్టి సొమ్ము చేసుకున్నారు. ఆ సమయంలోనే అప్పటి ప్రతిపక్ష తెలుగుదేశం నాయకులు అమిగోస్‌పై పెద్ద ఎత్తున ఆరోపణలు చేయడమే కాకుండా చర్యలుంటాయని చెప్పారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ సంస్థ హుటాహుటినా కార్యాలయాన్ని తరలించింది. విచారణ చేపడుతున్నట్టు అధికారులు కూడా ప్రకటించారు. కాని తరువాత ఏమైందో అంతా సర్దుకుంది. ఇప్పటికీ అమిగోస్ రాయల్టీ వసూళ్లను యథేచ్ఛగా చేపడుతోంది. దీనికి కారణం పైస్థాయిలో ఆ సంస్థకు అధికారపార్టీ నేతలతో ఒప్పందం జరిగిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆ ఒప్పందం మేరకు అమిగోస్ కాకుండా మరో సంస్థకు లోపాయికారిగా రాయల్టీ వసూళ్ల బాధ్యతలను అప్పగించినట్టు సమాచారం.

అమిగోస్‌పై చర్యలు తీసుకోవాలి

అమిగోస్ సంస్థ సామాన్యులు, చిన్నచిన్న పనులు చేసుకునే వారి నుంచి పెద్దమొత్తంలో రాయల్టీలను వసూలు చేస్తోంది. ట్రాక్టర్ నడుపుకునే వారిని కూడా వదలకుండా ముక్కుపిండి డబ్బులు వసూలు చేస్తోంది. ఈ డబ్బులను ఇప్పటికీ ప్రభుత్వానికి చెల్లించలేదు. ఈ సంస్థపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలి.

ఓ.నల్లప్ప, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు.

అంతర్జాతీయ స్థాయికి అనంత అరటి

తాడిపత్రి నుంచి ముంబైకి బనానా ట్రైన్ - విజయవాడ నుంచి వర్చువల్‌గా ప్రారంభం

ప్రజాశక్తి-తాడిపత్రి



అరటి పండ్ల రవాణా రైలును జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎంపీ, కలెక్టర్

అంతర్జాతీయ స్థాయికి అనంతపురం జిల్లా అరటి ఉత్పత్తులు చేరుతున్నాయి. తాడిపత్రి రైల్వే స్టేషన్‌లో శుక్రవారం తాడిపత్రి రైల్వే స్టేషన్ నుంచి ముంబైకి అరటి ఉత్పత్తులతో వెళ్లే బనానా రైలును ప్రారంభించారు. ముంబై నుంచి షిప్ ద్వారా ఇరాక్ దేశానికి అరటి ఉత్పత్తులు వెళ్లనున్నాయి. విజయవాడ నుంచి వర్చువల్‌గా పాల్గొని బనానా రైల్‌ను వ్యవసాయ, మార్కెటింగ్ ప్రిన్సిపల్ సెక్రెటరీ బి.రాజశేఖర్, ఏపీ. గుంటూరు హార్టికల్చర్ అండ్ సిరికల్చర్ డైరెక్టర్ కె.శ్రీనివాసులు ప్రారంభించారు. తాడిపత్రి రైల్వేస్టేషన్ నుంచి బనానా రైల్‌ను అనంతపురం ఎంపీ అంబిక లక్ష్మీనారాయణ, కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్ రెడ్డి, న్యూఢిల్లీ ఏపీఈడీఏ జనరల్ మేనేజర్ వినీత సుధన్ను, హైదరాబాద్ కంటైనర్ కార్పొరేషన్, సీనియర్ జనరల్ మేనేజర్ అనిత బారిక్, జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ తదితరులు పాల్గొన్నారు. వర్చువల్‌గా పాల్గొన్న వ్యవసాయ, మార్కెటింగ్ ప్రిన్సిపల్ సెక్రెటరీ బి.రాజశేఖర్ మాట్లాడుతూ అనంతపురం జిల్లాలో తొమ్మిది రకాల పండ్లు పండిస్తున్నారని, వీటిని అంతర్జాతీయ స్థాయికి చేరుకునేందుకు తమవంతు సహకారం అందిస్తామన్నారు. అనంతపురం ఎంపీ అంబిక లక్ష్మీనారాయణ మాట్లాడుతూ అనంత జిల్లా అరటిని దేశంలోనే కాదు ప్రపంచంలోనే అగ్రగామిగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పనిచేస్తున్నారన్నారు. చంద్రబాబు ముందుచూపుతో జిల్లాలో లక్ష టన్నుల ఎగుమతి చేసే స్థాయికి చేరుకుంది. అరటి ఉత్పత్తులను అంతర్జాతీయ స్థాయికి ఎగుమతి చేయడం వల్ల 10-15 రూపాయల అధిక ధర రైతులకు వస్తుందన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో ఉద్యాన పంటలు దాదాపు 1,04,021 హెక్టార్లలో సాగవుతున్నాయని, 25.95 లక్షల మెట్రిక్ టన్నుల వివిధ పండ్ల దిగుబడిని అందిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకృష్ణ ఇంపెక్స్ వెంచర్స్ ప్రయివేటు లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ అనిష్ అగర్వాల్, ఆర్డీవో కేశవనాయుడు, హార్టికల్చర్ డిడి నరసింహారావు, జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ, మార్కెటింగ్ ఎడి సత్యనారాయణ చౌదరి, ఎన్ఐసి డిఐఒ రవిశంకర్, ఏపీఎంఐపీ పీడీ రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎక్సైజ్ స్టేషన్ తనిఖీ

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలోని ఎక్సైజ్ స్టేషన్‌ను శుక్రవారం డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య, అసిస్టెంట్ కమిష నర్ జి.మునిస్వామి సందర్శించి రికార్డులను పరిశీలించారు. రికార్డుల నిర్వహణపై స్థానిక ఎక్సైజ్ ఇన్ స్పెక్టర్‌కు పలు సూచనలు చేశారు. కర్నాటక మద్యం, నాటుసారా, గంజాయి రవాణా, వినియోగాన్ని అరికట్టడానికి దాడులు విస్తృతం చేయాలని ఆదేశించారు. పాత నేరస్తులు, అనుమానితులను తహశీ ల్దార్ ముందు బైండోవర్ చేయాలని ఆదేశించారు. వారి వెంట రాయదుర్గం ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ డి.సోమశేఖర్, కె.పవన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

మండలంలోని ఎం.కొండాపురం గ్రామంలో జరుగుతున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను శుక్రవారం టిడిపి నాయకులు దేవినేని అవినాష్ చౌదరి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఈ రోడ్లకు ఎమ్మెల్యే సురేంద్రబాబు రూ. 2 కోట్లు మంజూరు చేయించారని తెలిపారు. త్వరలోనే డ్రయినేజీ పనులను కూడా ప్రారంభిస్తామని తెలిపారు. ఆయన వెంట కొండాపురం ప్రెసిడెంట్ లాల్‌కృష్ణ, రవినాయక్, కూటమి నాయకులు, తదితరులు ఉన్నారు.

టిడిపి కార్యకర్త కుటుంబానికి రూ. 50వేలు అందజేత

మండలంలోని బాలవెంకటాపురం గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త మార్గాని బొజ్జన్న యాదవ్ మృతి చెందాడు. దీంతో ఆయన కుమారుడు చదువు కోసం వారి కుటుంబానికి ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆదేశాల మేరకు దేవినేని అవినాష్‌చౌదరి ఆ గ్రామం వెళ్లి బొజ్జన్నయాదవ్ కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 50 వేలు అందజేశారు. ఆయన వెంట కొండాపురం సర్పంచి లాల్‌కృష్ణ, రవినాయక్, తదితరులు ఉన్నారు.



ఆర్థిక సాయం అందిస్తున్న దేవినేని అవినాష్‌చౌదరి

స్పందించే వరకు ఆందోళన కొనసాగిస్తాం

రెండవ రోజు పారిశుధ్య కార్మికుల నిరసన - నాయకులతో కమిషనర్ చర్చలు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్



నిరసన తెలుపుతున్న మున్సిపల్ పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికులు

దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించేంత వరకు ఆందోళనలు కొనసాగిస్తామని అనంతపురం మున్సిపల్ పారిశుధ్య కార్మికులు అధికారులకు స్పష్టం చేశారు. సమస్యల పరిష్కారం కోరుతూ పారిశుధ్య ఇంజినీరింగ్ కార్మికులు చేపట్టిన విధుల బహిష్కరణ నిరసన కార్యక్రమం 2వ రోజు కొనసాగింది. శుక్రవారం తెల్లవారుజామున నగరంలోని ఆరు సర్కిళ్లలో అటెండెన్స్ వేయించుకుని కార్మికులు విధులు బహిష్కరించి అక్కడే నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు విధులు నిర్వహించటానికి అవసరమైన పనిముట్లు పరకలు గడచిన మూడున్నర సంవత్సరాలుగా పంపిణీ చేయలేదన్నారు. కార్మికులే మూడు నెలలకు ఒకసారి పరకలు కొనుగోలు చేసి విధులు నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. సమస్యలను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కరించలేదన్నారు. పెండింగ్ వేతనాలు, పిఎఫ్, ఇఎస్ఐ తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కరించేంత వరకు ఆందోళన కొనసాగిస్తామని నాయకులు తెలిపారు.

కార్మికులతో కమిషనర్ చర్చలు

మున్సిపల్ కార్మికుల చేస్తున్న నిరసనపై కమిషనర్ నాగరాజు స్పందించారు. శుక్రవారం మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం, సిఐటియు నాయకులతో మేయర్ ఛాంబర్‌లో చర్చలు జరిపారు. ఇందులో కమిషనర్‌తో పాటు డిప్యూటీ మేయర్ విజయభాస్కర్ రెడ్డి పాల్గొన్నారు. కార్మికులకు పనిముట్లు శనివారం మస్టర్ సమయంలోనే పరకలు, గంపలు, టబ్బులు, కాలువ పారలు అందజేస్తామన్నారు. చనిపోయిన ఇద్దరు కార్మికులకు ఎక్స్‌గ్రేషియా ఫైలు తయారు చేసి ప్రభుత్వానికి పంపుతామన్నారు. బకాయి ఉన్న వేతనాలకు సంబంధించి అదనపు కార్మికులకు ఒక నెల చెక్కు రూపాన వారివారి అకౌంట్లో శనివారంలోగా వేస్తామన్నారు. మిగిలిన సమస్యలన్నింటినీ త్వరలోనే పరిష్కారించేలా చూస్తామన్నారు. అధికారులు ఇచ్చిన హామీపై సిఐటియు నాయకులు స్పందించారు. శనివారం ఉదయాన్నే పనిముట్లు ఇస్తే పనులకు వెళ్తామని, లేని పక్షంలో నిరసన యథావిధిగా కొనసాగుతుందని కమిషనర్‌కు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎర్రిస్వామి, తిరుమలేష్, కోశాధికారి లక్ష్మీనరసమ్మ, ఆదినారాయణ, వరలక్ష్మి, లక్ష్మీనారాయణ, ముత్తురాజు, నల్లప్ప, రాజు, వెంకటేష్, ఆనంద్, ఆదినారాయణ, కుమార్, జయరాం పాల్గొన్నారు.

మాయ చేసి.. నగదు కాజేసి..!

ఫోన్‌పే పేరుతో రూ.20వేలు మోసం

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

'ఆసుపత్రిలో తమబంధువులు ఉన్నారు.. వారి వైద్యం కోసం నగదు కావాలి.. మీరు డబ్బులు ఇస్తే నేను ఫోన్‌పే ద్వారా మీకు తిరిగి వెంటనే చెల్లిస్తాను' అని చెప్పి సైబర్ నేరగాళ్లు మోసం చేశారు. ఇలా గుర్తు తెలియని వ్యక్తి మాటలు నమ్మి ఒకరు తన డబ్బులను పోగొట్టుకున్నాడు. ఇందుకు సంబంధిం వివరాలు ఇలా ఉన్నాయి... పెద్దవడుగూరు మండలం కాశేపల్లి సమీపంలో ఉన్న భారత్ పెట్రోల్ బంకులో శంకర్ అనే వ్యక్తి పని చేస్తున్నాడు. ఈనెల 20వ తేదీన పెట్రోల్ బంకు వద్దకు గుర్తుతెలియని వ్యక్తి ఆటోలో వచ్చాడు. ఆసుపత్రిలో తమ బంధువులు ఉన్నారని, చికిత్స చేయించాలని అందుకు రూ.20వేలు నగదు కావాలని శంకర్‌ను అడిగాడు. రూ.20వేలు నగదు ఇస్తే తాను ఫోన్‌పే ద్వారా డబ్బులు చెల్లిస్తానని చెప్పాడు. చెప్పినట్టుగానే శంకర్ చరవాణికి సోలుపాటి సమతారెడ్డి పేరు నుంచి రూ.20వేలు నగదును బదిలీ చేశాడు. నగదు వచ్చినట్లు సెల్‌ఫోన్‌కు మెసేజ్ రావడంతో శంకర్ రూ.20వేల నగదును అతనికి ఇచ్చేశాడు. గంట సేపటి తర్వాత శంకర్ తన ఖాతాలో నగదును పరీక్షించుకోగా రూ.20వేలు జమకానట్లు తెలిసింది. వెంటనే అతను బ్యాంకు అధికారులను సంప్రదించాడు. అక్కడ పరిశీలించిన బ్యాంకు అధికారులు అతని ఖాతాను ఫ్రీజ్ చేశారని, కర్నాటక రాష్ట్రం మహాదేవపుర బ్యాంకు నుంచి సైబర్ ఫిర్యాదు నెంబరు 31611240096362 నమోదు అయినట్లు తెలిపారు. బ్యాంకు అధికారుల మాటలతో అతను ఖంగుతిన్నాడు. పొట్టకూటికోసం పెట్రోలు బంకులో పనిచేసేందుకు వచ్చి ఇలా మోసపోయానని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ విషయంపై పెద్దవడుగూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు.



మృతి చెందిన విద్యార్థి అఖిల్ (ఫైల్‌ఫోటో)

ప్రాణం తీసిన ప్రయివేటు బస్సు

8వ తరగతి విద్యార్థి మృతి
తల్లడిల్లిన తల్లిదండ్రులు

ప్రజాశక్తి-పెనుకొండ

ఉదయాన్నే అమ్మానాన్నలకు టాటా చెప్పి పాఠశాలకు బయల్దేరాడు. పుస్తకాలను భుజానికి వెసుకుని చదువుల బడికి ఆనందంగా వెళ్తున్నాడు. ఇంతలో అనుకోని ఘటనతో ఆ విద్యార్థి మృత్యుఒడికి చేరాడు. ప్రయివేటు బస్సు వెనక్కు తిప్పికునే క్రమంలో విద్యార్థినిని గమనించకుండా పోనీయడంతో చక్రం కింద పడి ఘటనా స్థలంలోనే మరణించాడు. పాఠశాలకు వెళ్తాన్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిన కుమారుడు అనుకోని ప్రమాదంలో మరణించడంతో తల్లిదండ్రులు గుండెలవసేలా రోధించారు. పెనుకొండ మండలం ఇస్లాపురం వద్ద శుక్రవారం ఉదయం చోటు చేసుకున్న ఈ ఘటన బాధిత కుటుంబంలో తీవ్ర విషాధాన్ని నింపింది. ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన మేరకు ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి...

పెనుకొండ మండలం ఇస్లాపురం గ్రామానికి చెందిన నాగరాజు, రాధమ్మల కుమారుడు అఖిల్(13) పట్టణంలోని శాంతినికేతన్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. శుక్రవారం ఉదయం పాఠశాలకు వెళ్లేందుకు తన సైకిల్లో బయలుదేరాడు. ఇస్లాపురం చెరువు కట్ట వద్దకు రాగానే పెనుకొండ పట్టణం ఘణగిరి పాఠశాలకు చెందిన స్కూలు బస్సు రివర్స్ చేసుకుంటోంది. బస్సు వెనక ఉన్న విద్యార్థినిని గమనించని స్కూల్ బస్సు డ్రైవర్ వేగంగా వెనక్కు బస్సును నడిపాడు. సైకిల్ పై ఉన్న నిఖిల్ పట్టుతప్పి కింద పడ్డాడు. బస్సు వెనుక చక్రాలు ఈ విద్యార్థిపై వెళ్లడంతో అక్కడికక్కడే మరణించాడు. కుమారుని మృతదేహాన్ని చూసి తల్లిదండ్రులు కన్నీటి పర్యవంతం అయ్యారు. ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

క్షయతో గతేడాది 23 లక్షలు మంది మృత్యువాత

శాస్త్రవేత్త డాక్టర్ అస్గర్ దస్తగిరి

ప్రజాశక్తి-అనంతపురం



అతిథిని సన్మానిస్తున్న జెఎన్‌టియు సిబ్బంది

ప్రపంచవ్యాప్తంగా గతేడాది క్షయ వ్యాధితో 23 లక్షల మంది మృత్యువాత పడ్డారని ప్రముఖ చెన్నై శాస్త్రవేత్త డాక్టర్ అస్గర్ దస్తగిరి తెలిపారు. ఒటిపిఆర్‌ఐ సంచాలకులు జివి సుబ్బారెడ్డి అధ్యక్షతన క్షయవ్యాధి చికిత్సకు సవాళ్లుగా పరిణమించిన యాంటీ మైక్రోబియల్ ఔషధ నిరోధకత, వాటి కారకాలు, నివారణ చర్యలపై శుక్రవారం సెమినార్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయ వ్యాధి రావడానికి కారణమయ్యే సూక్ష్మజీవులు, నిర్ధారణలో ఆధునిక విధానాలు, ఔషధాల రకాలు, వాటి పని తీరును విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సి.గోపీనాథ్, ప్రొఫెసర్ బి.దిలీప్‌కుమార్, ప్రొఫెసర్ వి.పద్మనాభరెడ్డి, ఒటిపిఆర్‌ఐ బోధనా సిబ్బంది మహేష్, డాక్టర్ పవన్‌కుమార్, జె.శ్రావణి, ఫార్మా డి, బి ఫార్మసీ, ఎం ఫార్మసీ విద్యార్థులు పాల్గొన్నారు.

'ఫసల్ బీమా'ను సద్వినియోగం చేసుకోవాలి

ఉరవకొండ : ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని విడపనకల్ మండల వ్యవసాయ అధికారి పెన్నయ్య శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. రైతులు సాగు చేసిన పంటలకు రైతులే బీమా ప్రీమియం చెల్లించుకోవాలన్నారు. ఆయా రైతులు ఆధార్ కార్డు, పొలం పాసు పుస్తకం, బ్యాంకు అకౌంట్, ఫోన్ నెంబర్‌తో ఆయా కామన్ సర్వీస్ సెంటర్లకు వెళ్లి బీమా ప్రీమియం చెల్లించుకోవాలని కోరారు.

టిడిపి సభ్యత్వ నమోదు

పామిడి : ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్, మండల ఇన్‌ఛార్జి ఈశ్వర్ ఆదేశాల మేరకు మండలంలోని ఎద్దులపల్లి గ్రామంలో శుక్రవారం టిడిపి సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ కార్యక్రమంలో కత్తిమల ప్రభాకర్‌చౌదరి, గౌసేపీరా, జింకల సంజీవ వెంకటరామిరెడ్డి, సుంకప్ప, నల్లబోతుల శీన, హమాలీ గోపాల్, ఈడిగ వెంకటనారాయణ, ఇమామ్‌లు, జయరాముడు, శివ, మంగళ తిప్పయ్య, రాజు, శివ తదితరులు పాల్గొన్నారు.

ఆకుతోటపల్లి పంచాయతీలో డిపిఒ పర్యటన

అనంతపురం : అనంతపురం రూరల్ పరిధిలోని ఆకుతోటపల్లి గ్రామ పంచాయతీలో జిల్లా పంచాయతీ అధికారి నాగరాజునాయుడు శుక్రవారం పర్యటించారు. ఇందులో భాగంగా 'స్వర్ణ పంచాయతీ పోర్టల్'లో హౌస్‌టాక్స్ అసెస్‌మెంట్, హౌస్ టు హౌస్ జియో ట్యాగింగ్‌పై ఆరాతీశారు. అలాగే వాటర్ ట్యాంకు శుభ్రతను పరిశీలించారు. 'చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని' పరిశీలించి పలు సలహాలు, సూచనలు జారీచేశారు. అలాగే 'ప్రజా సమస్యలు ఫిర్యాదులు-పరిష్కారాలు'లో వచ్చిన ఫిర్యాదుకు సంబంధించి శిల్పా లేపాక్షి నగర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా తాగునీరు, డ్రైనేజీ సమస్యలపై విచారణ చేపట్టారు. ఈ కార్యక్రమం సర్పంచి చిట్రా గురుప్రసాద్, కార్యదర్శి అశోక్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కర్నూల్లులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చారిత్రాత్మక నిర్ణయం

అనంతపురం కలెక్టరేట్ : కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చారిత్రాత్మక నిర్ణయమని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌కు రాష్ట్ర న్యాయ శాఖ కార్యదర్శి గతనెల 28న లేఖ రాయడం, మంత్రివర్గం ఆమోదం తెలపడంపై సంతోషకరమన్నారు. రాయలసీమ వాసిగా ఈ సభలో తాను ఉన్నందుకు ఎంతో గర్వంగా ఉందన్నారు.

రాజ్‌కుమార్‌కు డాక్టరేట్



అనంతపురం : శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో మేనేజ్‌మెంట్ విభాగంలో ప్రొఫెసర్ కె.వేణుగోపాల్‌రావు పర్యవేక్షణలో 'ఇంపాక్ట్ ఆఫ్ కార్పొరేట్ యాక్షన్ ఆన్ ఇన్వెస్టిగేషన్ ఆఫ్ ది ఇన్వెస్టర్ విత్ రెఫరెన్స్ టు రాయలసీమ రీజియన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అనే అంశంపై పరిశోధన చేసిన మోచి రాజ్‌కుమార్‌కు డాక్టరేట్ ప్రదానం చేసింది. రాజ్‌కుమార్ తన పరిశోధన సమయంలో పలు జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌లో ఆర్టికల్స్ ప్రచురించారు. తన ఉన్నతికి సహకరించిన గురువు వేణుగోపాల్‌రావుతోపాటు ఇతర ఆచార్యులు, సహ పరిశోధులు, ఆత్మీయులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉద్యోగుల క్రికెట్ పోటీలు అభినందనీయం : ఆర్‌డిఒ

అనంతపురం : అనంతలో వెటరన్స్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉద్యోగులకు ప్రత్యేకంగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమని ఆర్‌డిఒ మలోల కొనియాడారు. శుక్రవారం నగరంలోని కలెక్టర్ కార్యాలయంలో ఉన్న డిఆర్‌ఒ కార్యాలయంలో ఇందుకు సంబంధించిన లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల ఐకమత్యానికి ఇలాంటి క్రీడలు చాలా ఉపయోగపడతాయన్నారు. అంతేగాకుండా ఉద్యోగులందరినీ ఒకవేదిక మీదకు తీసుకురావడం శుభపరిణామమన్నారు. ఈ కార్యక్రమంలో వెటరన్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు మచ్చా రామలింగారెడ్డి, ఉద్యోగుల క్రికెట్ టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు విజయరాజు, సతీష్, మారుతి, శ్రీకాంత్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

'నో ప్లాస్టిక్' సంచులు విడుదల

ప్రజాశక్తి-అనంతపురం

'నో ప్లాస్టిక్' నినాదంతో బట్ట సంచులను ప్రజలకు అందించేందుకు డిస్కవర్ అనంతపురం అనిల్‌కుమార్ ముందుకొచ్చారు. ఈమేరకు శుక్రవారం సుమారు రూ.10లక్షలతో తయారు చేసి బట్ట సంచులను విడుదల చేశారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ మాట్లాడుతూ తోపుడు బండ్లు, కాయగురల దుకాణాలే లక్ష్యంగా ఈవారంలోనే తొలి విడత పంపిణీకి 10వేల సంచులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. మొట్టమొదట అనంతపురం నగర కేంద్రమే తన లక్ష్యంగా బట్ట సంచుల పంపిణీకి శ్రీకారం చుట్టామన్నారు. ఇందుకు ప్రజలు కూడా సహకరించాలని కోరారు.



బట్ట బ్యాగులను ఆవిష్కరిస్తున్న అనిల్‌కుమార్

అవినీతిపరులకు సిపిఎంలో స్థానం లేదు

నగర న్యూటౌన్ కమిటీ కార్యదర్శి ఆర్‌వి.నాయుడు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్



సమావేశంలో మాట్లాడుతున్న నగర న్యూ కమిటీ కార్యదర్శి ఆర్‌వి.నాయుడు

అవినీతిపరులు, అరాచక వాదులకు సిపిఎంలో స్థానం లేదని సిపిఎం నగర న్యూటౌన్ కమిటీ కార్యదర్శి ఆర్‌వి.నాయుడు తెలిపారు. శుక్రవారం నగరంలోని గణేనాయక్ భవన్‌లో సిపిఎం నగర న్యూ కమిటీ సభ్యులు ఇర్ఫాన్ అధ్యక్షతన అభ్యుదయ కాలనీ, సీతారాం ఏచూరి కాలనీల వాసులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల అవసరాలను అవకాశంగా తీసుకుని అవినీతికి పాల్పడిన లక్ష్మీనారాయణను బహిష్కరించినందుకు కాలనీవాసులు సిపిఎంకు అభినందనలు తెలిపారు. పేదల కోసం పని చేసే క్రమంలో కొందరు అవకాశావాదులు పార్టీలోకి చేరుతారని, అలాంటి వారిని ఏరివేసి పార్టీ విలువలను కాపాడుకుంటామన్నారు. కాలనీలోని కొందరిని మభ్యపెట్టి, భయపెట్టి పార్టీ కార్యాలయానికి తీసుకెళ్లిన వ్యక్తి నిజస్వరూపాన్ని గుర్తించి తిరిగి సిపిఎం ఆఫీస్‌కు వచ్చిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ఇకపోతే స్థానిక టీవీ టవర్ వద్ద కామ్రేడ్ సీతారాం ఏచూరి కాలనీలో పేదలు వేసుకున్న గుడిసెలకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. డిసెంబర్ 23, 24వ తేదీల్లో అనంతపురంలో జరిగే సిపిఎం జిల్లా మహాసభల సందర్భంగా సిపిఎం విధానాన్ని నగరంలోని ప్రతి ఇంటికీ తీసుకువెళ్లేందుకు కషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు ముత్తుజా, గోపాల్, కమిటీ సభ్యులు ఓబులేసు, కాలనీ నాయకులు పాల్గొన్నారు.

జగన్‌పై అసభ్యకర పోస్టింగులు బాధాకరం

వైసిపి జిల్లా అధ్యక్షుడు అనంత- టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

ప్రజాశక్తి-అనంతపురం



విలేకరులతో మాట్లాడుతున్న వైసిపి నాయకులు

మాజీ ముఖ్యమంత్రి జగన్‌తోపాటు, ఆయన కుటుంబ సభ్యులపై అసభ్యకరమైన పోస్టింగులు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం నగరంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో వైసిపి ప్రజాప్రతినిధులు, నాయకులు, వైసీపీ లీగల్ సెల్ సభ్యులతో కలిసి ఫిర్యాదు చేశారు. ఇందులో భాగంగా మంత్రులు నారా లోకేష్, వంగలపూడి అనిత, అచ్చెన్నాయుడు, అయ్యన్నపాత్రుడుకు చెందిన 'ఎక్స్' (ట్విట్టర్) ఖాతాల నుంచి చేసిన పోస్టులను సీఐ శ్రీకాంత్‌యాదవ్‌కు వివరించారు. అనంతరం మీడియాతో అనంత మాట్లాడుతూ జగన్‌పై చేసిన మార్ఫింగ్ పోస్టులు తమ మనోభావాలు గాయపరిచేలా ఉన్నాయన్నారు. వెంటనే అసభ్యకర పోస్టులు చేసిన మంత్రుపై కేసులు నమోదు చేయాలని కోరారు. ఆయా పోస్టులు నారా లోకేష్ ఆఫీస్‌లోనే తయారు చేసినట్లు అనుమానం ఉందన్నారు. ఎవరైనా సోషల్ మీడియాలో మార్ఫింగ్ చేసిన పోస్టులు చేస్తే చర్యలు తీసుకుంటామని చెబుతున్న చంద్రబాబు.. అందరికీ సమానంగా చట్టం అమలు అయ్యేలా చూడాలని కోరారు. తాము చేసిన ఫిర్యాదును రిజిస్టర్ చేయకపోతే చట్టపరంగా ముందుకెళ్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ తలారి రంగయ్య, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, వైసిపి లీగల్ సెల్ జిల్లా అధ్యక్షులు ఉమాపతి, తదితరులు పాల్గొన్నారు.

యాంటీబయాటిక్స్ వాడకాన్ని తగ్గించాలి

మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్.మాణిక్యరావు

ప్రజాశక్తి-అనంతపురం



ర్యాలీని ప్రారంభిస్తున్న అతిథులు

రోగులకు యాంటీబయాటిక్‌ల వాడకాన్ని తగ్గించాలని మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్.మాణిక్యరావు సూచించారు. ప్రపంచ ఔషధ నిరోధక అవగాహన వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మెడికల్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్, మైక్రో బయాలజీ, ఫార్మకాలజీ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించడంతో పాటు వ్యాసరచన, వకృత్వ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఔషధ నిరోధకతకు అనవసరంగా మందులు వాడడం, అవసరమైనంత మోతాదులో మందులు వాడకపోవడం ప్రధానమైన కారణాలన్నారు. సాక్ష్యం ఆధారితంగా మందు (ఎవిడెన్స్ బేస్డ్ మెడిసిన్)ను తీసుకుంటే డ్రగ్ రెసిస్టెన్స్‌ను నిరోధించవచ్చన్నారు. పెద్దాసుపత్రి సూపరింటెండెంట్ కెఎస్ఎస్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ యాంటీ మైక్రోబియల్స్ ఎక్కువగా వాడటం వల్ల మన శరీరంలో ఉండే మంచి బ్యాక్టీరియా చనిపోతుందన్నారు. తద్వారా జీర్ణకోశ, చిన్నప్రేగు, పెద్దప్రేగు సమస్యలు ఉత్పన్నమవుతాయని, సొంత వైద్యం ప్రమాదకరమని, డాక్టర్ సలహా మేరకు మాత్రమే మందులను వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో మైక్రో బయాలజీ ప్రధాన విభాగాధిపతి డాక్టర్ శాంతిరెడ్డి, వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపల్ షారోన్ సోనియా, వైద్యులు హైమావతి, ఉమాదేవి, ప్రవీణ, ప్రియాంక, ఆశాలత, పద్మశ్రావణి, ఫర్జానా, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఆదిరెడ్డి పరదేశీనాయుడు, మైక్రో బయాలజీ ఫార్మకాలజీ పోస్ట్ గ్రాడ్యుయేట్ డాక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి ఎన్నికలకు సర్వం సిద్ధం

ప్రజాశక్తి-పుట్లూరు

వచ్చేనెల 8వతేదీన నిర్వహించనున్న సాగునీటి ఎన్నికలకు సర్వం సిద్ధం చేసినట్లు తహశీల్దార్ శేషారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల వ్యాప్తంగా 4,201 మంది రైతులు ఓట్లు ఉండగా వీరిలో పురుషులు 2943, మహిళలు 1258 ఓట్లు ఉన్నట్లు తెలిపారు. వీటిలో పుట్లూరు సాగునీటి సంబంధించి 1,098 మంది పురుషులు, 468 మహిళలు, కడవకల్లు సాగునీటికి సంబంధించి పురుషులు, 784 మహిళలు 291, ఎస్.గూడూరు సాగునీటికి సంబంధించి పురుషులు 1,061, మహిళలు, 499 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు.

యల్లనూరు : వచ్చేనెల 8వతేదీన సాగునీటి ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఇన్‌ఛార్జి తహశీల్దార్ రాజా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. కల్లూరులో 1,048, యల్లనూరులో 893, తిరుమలాపురంలో 930, వేములపల్లి 847 ఓట్లు ఉన్నట్లు తెలిపారు.

మెడికల్ రెప్స్ సమస్యలు పరిష్కరించాలి

కలెక్టర్‌కు యూనియన్ నేతల వినతి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

మెడికల్ సేల్స్ రెప్రంజెంటేటివ్స్‌లకు చట్టబద్ధమైన పని విధానాలు కల్పించాలని మెడికల్ సేల్స్ రిప్రజెంటేటివ్ యూనియన్ నాయకులు కోరారు. మెడికల్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ జాతీయ కమిటీ పిలుపులో భాగంగా శుక్రవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సంరద్భంగా యూనియన్ నాయకులు మనోహర్, చంద్రశేఖర్, ఇషాక్, జిల్లా కార్యదర్శి మంజునాథ్ మాట్లాడుతూ మెడికల్ రెప్‌ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించినట్లు తెలిపారు. వారికి మద్దతుగా జిల్లా మెడికల్ యూనియన్‌లో ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపినట్లు వివరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి మెడికల్ రెప్‌ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లను వాడాలి

ప్రజాశక్తి-నార్పల

ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లను వినియోగించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎంపిడిఒ గంగావతి, ఇఒఆర్‌డి శైలజారాణి, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ జనార్ధన్, సర్పంచి సాకే రామాంజనేయులు సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని శిద్ధరాచర్ల పంచాయతీ దుర్గం గ్రామంలో ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా మరుగుదొడ్ల ఆవశ్యకత, వాడకపోవడం వల్ల కగే నష్టాలు, వాడితే కలిగే ఆరోగ్య ప్రయోజనాలను వివరించారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సాకే కుళ్లాయప్ప, గ్రామ రెవెన్యూ అధికారి మౌనిక, ఇంజినీరింగ్ అసిస్టెంట్ మహేష్‌నాయుడు, గ్రామ సర్వేయర్ శ్రీకాంత్, ప్రధానోపాధ్యాయులు నాగార్జునరెడ్డి, ఉపాధ్యాయులు ఎంఎల్‌హెచ్‌పి శివకుమార్, అమృతాంజలి, ఏఎన్ఎం ఫరీదాభాను, అంగన్వాడీలు బాలమ్మ, పెద్దక్క, ఆశావర్కర్ వీరనారాయణమ్మ, క్లాప్‌మిత్ర సోమశేఖర్, గ్రామస్తులు కాటమయ్య, నారాయణ, బాల కుల్లాయప్ప, తదితరులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు : ప్రతి ఇంటా మరుగుదొడ్లను వాడి ఆత్మగౌరవాన్ని కాపాడుకోవాలని అరబ్ల్యుఎస్ ఇంజినీరు ఆంజనేయులు సూచించారు. ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా పెద్దవడుగూరు, క్రిష్టిపాడు గ్రామాల్లో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. . ఇందులో భాగంగా మరుగుదొడ్ల ఆవశ్యకత, వాడకపోవడం వల్ల కగే నష్టాలు, వాడితే కలిగే ఆరోగ్య ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ఆంజనేయులు, షేక్షావలి, పంచాయతి, సచివాలయ సిబ్బంది అరుణ, జయరాముడు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రత్యేక ఓటరు నమోదు

ప్రజాశక్తి -అనంతపురం

రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి, జిల్లా ఎన్నికల అధికారి (కలెక్టర్) ఆదేశాల మేరకు నేటి నుంచి రెండు రోజులపాటు అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు అర్బన్ తహశీల్దార్ ఎ.హరికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 23, 24వతేదీల్లో రెండు రోజులపాటు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటలకు వరకూ బిఎల్‌ఒలు అందుబాటులో ఉండి అర్హులైన ఓటర్ల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు.

గుత్తి : రెండు రోజులపాటు ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ డి.ఓబులేసు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ఎన్నికల సంఘం జారీ చేసిన స్పెషల్ సమ్మరీ రివిజన్ 2025లో భాగంగా ఈనెల 23, 24వ తేదీల్లో మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ ప్రత్యేక ఓటరు నమోదు చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా 18ఏళ్లు పూర్తి అయిన యువతీ యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు.

అర్హులందరికీ జాబ్‌కార్డులు : ఎపిఒ

బుక్కరాయసముద్రం : మండలంలో అర్హత ఉన్న వారందరికీ ఉపాధి హామీ జాబ్‌కార్డులు మంజూరు చేయనున్నట్లు ఎపిఒ పోలేరయ్య తెలిపారు. శుక్రవారం మండలంలోని పసులూరు, పొడరాళ్ల, వడియంపేట, దండువారిపల్లి, సిద్ధరాంపురం, గోవిందపల్లి, బొమ్మలాటపల్లి, దయాలకుంటపల్లి, రెడ్డిపల్లి, కొర్రపాడు, నీలంపల్లి, బి.కొత్తపల్లి పంచాయతీల్లో గ్రామసభలు ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా ఆయా గ్రామాల్లో జాబ్‌కార్డులపై ఆరాతీస్తూ లేనివారికి మంజూరు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శులు,ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్‌గా పద్మశ్రీ



అనంతపురం : ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల నూతన ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్‌గా జియాలజీ విభాగానికి చెందిన పి.పద్మశ్రీని నియమిస్తూ కళాశాలల విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుత ప్రిన్సిపల్ ఎసి దివాకర్‌రెడ్డిని జమ్మలమడుగు పూర్వ ప్రభుత్వ కళాశాలకు పంపుతూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఇకపోతే నూతనంగా ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్‌గా నియమితులైన పద్మశ్రీ 30ఏళ్లుగా జియాలజీ అధ్యాపకురాలిగా పని చేస్తోంది. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపల్ శశాంక్ మౌళి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు

గుత్తి : పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో శుక్రవారం పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాన్ని వ్యవసాయ మార్కెట్ యార్డ్ కార్యదర్శి బాలాజీ రావు, సేల్స్ అధికారి పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. పలువురు రైతుల నుంచి పత్తిని కొనుగోలు చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ యార్డ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కంది పంటను కాపాడుకోవాలి

బుక్కరాయసముద్రం : పొలాల్లో మారుకా మచ్చల పురుగు నివారించి కంది పంటను కాపాడుకోవాలని శాస్త్రవేత్త డాక్టర్ కిశోర్ సూచించారు. శుక్రవారం కనగానిపల్లి, రామగిరి, కొత్తచెరువు మండలాల్లో కోనేటినాయుని పాళ్యం, నసనకోట, లింగారెడ్డిపల్లి గ్రామాల్లో రైతులు సాగు చేసిన పంటలను కృషి విజ్ఞాన శాస్త్రవేత్తలు పరిశీలించారు. ఇందులో భాగంగా కంది పంటకు గూడు కట్టే పురుగు ఆశిస్తున్నట్లు గమణించి రైతులకు సలహాలు, సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ శశికళ, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

తిమ్మంపల్లిలో ఆధార్ క్యాంపు

యల్లనూరు : మండల పరిధిలోని తిమ్మంపల్లి జిల్లా ఉన్నత పాఠశాలలో ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఎంపిడిఒ వాసుదేవరరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆధార్ కార్డుల్లో మార్పులు, చేర్పులు చేసుకోవాలని కోరారు.

సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు స్థలాల పరిశీలన

ఆత్మకూరు : ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశాల మేరకు మండలంలోని గొరిదిండ్ల, తోపుదుర్తి గ్రామాల్లో నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు శుక్రవారం స్థలాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ బోయ గంతి శ్రీనివాసులు, పార్లమెంట్ అధికార ప్రతినిధి శశాంక్‌బాబు, పాపంపల్లి శ్రీనివాసరెడ్డి, మాజీ జడ్పిటిసి కుళ్లాయప్ప, మాజీ సర్పంచి బాలానాయక్, మాజీ ఎంపిటిసి రాముసందీప్‌చౌదరి, అశ్వర్థప్ప, సత్యనారాయణ చౌదరి, లింగమయ్య, రాజేష్‌కుమార్, జగన్, సురేష్, రైతులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కడప రీజినల్ ఛైర్మన్‌కు సన్మానం

పామిడి : నూతనంగా ఎన్నికైన ఎపిఎస్ ఆర్టీసీ కడప రీజినల్ ఛైర్మన్ పూల నాగరాజు ప్రమాణ స్వీకారం సందర్భంగా మండల టిడిపి నాయకులు శుక్రవారం అనంతపురంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీడీపి నాయకులు కత్రిమల ప్రభాకర్‌చౌదరి, మాజీ ఎంపిటిసి జింకల సంజీవకుమార్, మాజీ మున్సిపల్ ఛైర్మన్ గౌస్‌పీరా, మాజీ ఎంపిటిసి నల్లబోతుల శ్రీనివాసులు, సీనియర్ నాయకుడు హమాలీ గోపాల్, తదితరులు పాల్గొన్నారు.



నాగరాజును సన్మానిస్తున్న పామిడి టిడిపి నాయకులు

ప్రజాశక్తి వార్తకు స్పందన

లీకేజీ అవుతున్న పైప్‌లైన్‌కు మరమ్మతులు

ప్రజాశక్తి-గుత్తి



పైపులైన్ పనులను చేస్తున్న సిబ్బంది

మున్సిపాలిటీ పరిధిలోని శ్రీమేధా పాఠశాల సమీపంలో ఉన్న ఓవర్ హెడ్ ట్యాంకుకు సంబంధించిన తాగునీటి పైపులైన్ లీకేజీ మరమ్మతులను మున్సిపల్ అధికారులు చేపట్టారు. 'గుత్తిలో పైప్ లైన్ లీకేజీ.. వృథాగా పోతున్న తాగునీరు' అనే కథనం శుక్రవారం ప్రజాశక్తిలో ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన మున్సిపల్ కమిషనర్ బి.జబ్బార్‌మియా, డిఇ హేమచంద్ర కార్మికులతో పైప్‌లైన్ మరమ్మతులు చేపట్టి లీకేజీలను అరికట్టారు. దీంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.

ఎస్‌జిఎఫ్ క్రీడల్లో 'మాంటిస్సోరి' విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి-రాప్తాడు



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో మాంటిస్సోరి యాజమాన్యం

ఎస్‌జిఎఫ్ క్రీడల్లో మండలంలోని గొల్లపల్లి వద్ద ఉన్న మాంటిస్సోరి విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచారు. ఇందులో భాగంగా అండర్-17, అండర్-14, అండర్-19 విభాగాల్లో మాంటిస్సోరి విద్యార్థులు పాల్గొని అత్యంత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి, జాతీయస్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ఎండి.భరత్‌కృష్ణ తెలిపారు. ఈమేరకు ఆయా విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులు చదువుల్లోనే కాకుండా క్రీడల్లో కూడా ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ సమీరా, కళాశాల ప్రిన్సిపాల్ మధు, ప్రధానోపాధ్యాయులు ప్రతాప్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న రామలింగారెడ్డి

బుక్కరాయసముద్రం : ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త కురబ పోతలయ్య కుటుంబానికి టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కాటప్పగారి రామలింగారెడ్డి శుక్రవారం ఆర్థికసాయం అందజేశారు. ఈమేరకు రూ.10వేల నగదును కుటుంబ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు అక్కులప్ప, మధుసూదన్‌గౌడ్, ఉపసర్పంచి వెంకట నారాయణరెడ్డి, బండి యల్లప్ప, బండి వెంకటరాముడు, అక్కులప్ప, బండి ఉజ్జినప్ప, కుళ్లాయప్ప, చంద్ర, చిన్న, వడ్డే గణేష్, తదితరులు పాల్గొన్నారు.

కర్నూలులో హైకోర్టు ఏర్పాటుపై న్యాయవాదుల హర్షం

ప్రజాశక్తి-గుత్తి

కర్నూలులో హైకోర్టు బెంచి ఏర్పాటుకు అసెంబ్లీలో ప్రభుత్వం తీర్మానం చేయడం పట్ల గుత్తిలో శుక్రవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎంకె.రామశర్మ, కార్యదర్శి నగదాని చంద్రశేఖర్ మాట్లాడుతూ హెచ్‌ఆర్‌సి, లోకాయుక్త కర్నూలులోనే కొనసాగిస్తామని సీఎం నారా చంద్రబాబు ప్రకటించడం హర్షణీయమన్నారు. సీఎం నారా చంద్రబాబునాయుడు, మంత్రులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు కె.మనోహర్‌బాబు, ఎం.మహమ్మద్‌రసూల్, ఆర్‌వి.చలపతి, సుబ్రమణ్యం, సాలప్ప, టిడిపి లీగల్ సెల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఫక్రుబాషా, శ్రీనివాసులు, ఓబులేసు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తాడిపత్రి : 33 కెవి సంజీవనగర్, ఆటోనగర్ ఫీడర్ మరమ్మతులు చేయనున్న దృష్ట్యా శనివారం ఉదయం 9 నుంచి 1గంట వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని సంజీవనగర్, మెయిన్ బజార్, గాంధీనగర్, శ్రీనివాసపురం, పప్పూరు రోడ్డు, విజయనగర్ కాలనీ, పోలీసు క్వార్టర్స్, కడప రోడ్, ఆర్టీసీ బస్టాండ్, యల్లనూరు రోడ్డు, నంద్యాల రోడ్డు, పుట్లూరు రోడ్డు ఏరియాలోని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. కావున ప్రజలు సహకరించాలని కోరారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

పజాశక్తి-బెలుగుప్ప

సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎంపిడిఒ లక్ష్మీనారాయణ సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని నరసాపురం, ఎస్.గుండ్లపల్లి గ్రామ సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా సిబ్బంది హాజరు పట్టికలను రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు పడకుండా వారి సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు సచివాలయ సిబ్బంది విధులకు సక్రమంగా హాజరు కావాలన్నారు. ఎవరైనా డుమ్మా కొడితే చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పప్పుశనగ పంట పరిశీలన

ప్రజాశక్తి-పుట్లూరు



పప్పుశనగ పంటను పరిశీలిస్తున్న అధికారులు

మండల పరిధిలోని పుట్లూరు, తక్కల్లపల్లి గ్రామాల్లో రైతులగా సాగు చేసిన పప్పుశనగ పంటను మండల వ్యవసాయ అధికారిణి కాత్యాయిని శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పప్పుశనగ పంటలో అక్కడక్కడ మొక్కలు చనిపోతున్నాయన్నారు. ఇందుకు నేల మొత్తం తడిసేలా మ్యాంకో జెబ్‌కార్బెండజిమ్ (సాఫ్) ఎకరాకు 400 గ్రాముల చొప్పున పిచికారి చేసుకోవాలని సూచించారు. లేదా హెక్సాకొనజోల్ 400 మీలి (లేదా) ప్రోపికొనజోల్ 200 మీలి ఏదో ఒకటి పిచికారి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విఎఎ భార్గవి, రైతులు పాల్గొన్నారు.

15లోపు పంటల బీమా ప్రీమియం చెల్లించాలి

రబీలో పంటలు సాగు చేసిన రైతులు డిసెంబర్ 15వతేదీ లోగా బీమా ప్రీమియం చెల్లించుకోవాలని మండల వ్యవసాయ అధికారిణి కాత్యాయిని కోరారు. లేనిపక్షంలో వాతావరణ బీమాకు అనర్హులు అవుతారన్నారు. పంటలు సాగు చేసిన రైతులు మీ పరిధిలోని మీ సేవా కేంద్రాలు, కామన్‌సర్వీస్ సెంటర్లలో స్వయంగా రైతులే వెళ్లి బీమా చెల్లించాలని సూచించారు.

నేరాలు ఘోరాలు

కాపర్ వైరు చోరీ



ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్లు

పుట్లూరు : మండలంలోని ఎ.కొండాపురం గ్రామంలో గురువారం రాత్రి వ్యవసాయ తోటలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టి కాపర్‌వైరును చోరీ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. కొండాపురం గ్రామానికి చెందిన పరిగి ఓబుళనాయుడు తోటలో ఏర్పాటు చేసుకున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్స్ రాత్రి పగులగొట్టి అందులోని కాపర్ వైరు ఎత్తుకెళ్లారు. శుక్రవారం ఉదయాన్నే తోటకు వచ్చిన రైతు దిమ్మెపై ట్రాన్స్‌ఫార్మర్ లేకపోవడంతో గమణించగా పగులగొట్టి కాపర్‌వైరును చోరీ చేసినట్లు గుర్తించాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్‌ఐ హేమాద్రితోపాటు ట్రాన్స్‌కో ఎఇ విజయుడు ఘటనా స్థలానికి చేరుకని పరిశీలించారు. బాధిత రైతు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నిబంధనల మేరకు సాగునీటి సంఘాల ఎన్నికలు : ఆర్డీవో



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో వసంతబాబు

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

సాగునీటి సంఘాల ఎన్నికలను ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్వహించాలని కళ్యాణదుర్గం ఆర్డీవో వసంతబాబు సూచించారు. మండలంలోని 74-ఉడేగోళం గ్రామంలోని మధ్వానేశ్వరస్వామి కళ్యాణ మండపంలో శుక్రవారం సాగునీటి సంఘాల ఎన్నికల అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వ హించారు. వివిధ శాఖల అధికారులు సమన్వయం చేసుకుంటూ పారదర్శకంగా ఎన్నికలు జరపాల న్నారు. ఇరిగేషన్ డిఈఈ, డిస్ట్రిక్ట్ మాస్టర్ ట్రైనర్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ సాగునీటి సంఘాల ఎన్నికలను చట్టం ప్రకారం మూడు పద్ధతుల్లో నిర్వహించవచ్చన్నారు. ఏకగ్రీవం చేయడం మొదటి పద్ధతి కాగా, సభ్యులు చేతులు ఎత్తి మద్దతు తెలిపే పద్ధతి రెండోది. ఓటింగ్ ద్వారా ఎన్నికలు నిర్వహిం చడం మూడో పద్ధతిగా ఉంటుందన్నారు. ఆయకట్టు మొదటి గ్రామంలో ప్రెసిడెంట్‌ను ఎన్నుకుంటే ఆయకట్టు చివరి గ్రామంలో వైస్ ప్రెసిడెంట్‌ను ఎన్నుకున్నే విధానం ఉంటుంది. ఆయకట్టు మొదట్లో ఉన్న గ్రామాల వారు నీటిని పూర్తిస్థాయిలో ఉపయోగించుకుంటారు, చివరి ఆయకట్టు గ్రామం దాకా నీరు చేరాలనే ఉద్దేశంతో అక్కడి సమస్యను తెలియజేసే విధంగా ప్రాధాన్యతలు కల్పించే విధానం ఉందన్నారు. డిసెంబర్ 5వ తేదీ నోటిఫికేషన్, 8నన మీడియం, మైనర్ ఇరిగేషన్ ఎన్నికలు జరుగు తాయన్నారు. భైరవానితిప్ప ప్రాజెక్టు మైనర్ ఇరిగేషన్ పరిధిలోకి వస్తుంది. 11వ తేదీ డిస్ట్రిబ్యూషన్ కమిటీ ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్ ఎన్నిక(హెచ్ఎల్‌సి), 14న ఛైర్మన్, వైస్ ఛైర్మన్ల ఎన్నిక జరుగు తుందన్నారు. బొమ్మనహాల్, రాయదుర్గం తహశీల్దార్లు బ్రహ్మయ్య, నాగరాజు పలు విషయాలపై అవగాహన కల్పించారు. సమావేశంలో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



సిఎం చంద్రబాబుకు వినతి ఇస్తున్న కాలవ శ్రీనివాసులు

ఉంతకల్లు రిజర్వాయర్ డిపిఆర్ తయారీకి సిఎం సమ్మతి

ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం

తుంగభద్ర ఎగువ కాలువకు అనుసంధానంగా బొమ్మనహాల్ మండలంలోని ఉంతకల్లు వద్ద నిర్మించతలపెట్టిన ప్రతిపాదిత రిజర్వాయర్ సమగ్ర నివేదిక (డిపిఆర్) తయారీ కోసం నిధుల విడుద లకు సిఎం చంద్రబాబు సమ్మతించినట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవా రం సాయంత్రం ఆయన సమర్పించిన వినతిపై నిధుల విడుదలకు సిఎం ఉత్తర్వులు ఇచ్చినట్లు కాలవ తెలిపారు. హెచ్ఎల్‌సి నీటిని ఉంతకల్లు వద్ద నిల్వ చేసుకుంటే జిల్లాలో ఎక్కడ, ఎప్పుడు అవసరం వచ్చి నా వినియోగించుకునే వెసులుబాటు ఉంటుందన్నారు. ఉంతకల్లు-నేమకల్లు గ్రామాల మధ్య సుమారు 5 టిఎంసిల సామర్థ్యంతో బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణానికి గతంలో తాను మంత్రిగా ఉన్నప్పుడు ప్రతిపాదించానన్నారు. దీని సాధ్యాసాధ్యాలపై డిపిఆర్ తయారు చేయాలని 2018 అక్టోబర్ 31న అప్పటి చంద్రబాబు ప్రభుత్వం జిఒ సైతం విడుదల చేసిందన్నారు. జగన్ సిఎం హోదాలో రాయదుర్గం పర్యటనలో ఉంతకల్లు రిజర్వాయర్ నిర్మాణానికి హామీ ఇచ్చినా, కనీసం డిపిఆర్ తయారీకి నిధులు ఇవ్వలేదన్నారు. సిఎం చంద్రబాబుకు ఉంతకల్లు రిజర్వాయర్ అవసరాన్ని వివరించగా ఆయన డిపిఆర్ తయారీకి అంగీకరించి, నిధుల విడుదలకు సమ్మతించారని కాలవ శ్రీనివాసులు వివరించారు.


రక్త పరీక్షలు

ఉరవకొండ : మండల పరిధిలోని రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి నాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం రాకెట్ల తండాలో రక్త పరీక్షలు నిర్వహించారు. ప్రజల్లో రక్త సంబంధ రుగ్మతలను గుర్తించేందుకు రక్త పరీక్షలు నిర్వహించినట్లు వైద్యాధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ నాగరంగయ్య, హెల్త్‌ఎడ్యుకేటర్ ఎస్ఎండి.షఫీ, సూపర్‌వైజర్ శేఖర్, ఎఎన్ఎం పద్మావతి, ఎంఎల్‌హెచ్‌పి భవాని, హారతి, నాగసురేఖ, తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు 'ప్రత్యేక ఓటరు నమోదు'

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

మండల వ్యాప్తంగా ఈ నెల 23, 24 తేదీల్లో నిర్వహించే ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎఈఆర్ఒ సుమతి తెలిపారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో శుక్రవారం ఓటరు నమోదుపై సూపర్వైజర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. మండల వ్యాప్తంగా ఓటరు నమోదు కేంద్రాల్లో బిఎల్ఒలు అందుబాటులో ఉంటూ ఓటరు నమోదు, తొలగింపు, మార్పు, సవరణకు దరఖాస్తులు స్వీకరించాలన్నారు. ఓటరు నమోదును బిఎల్ఒలు పకడ్బందీగా నిర్వహించి దిగ్విజయం చేయాలన్నారు. మండలంలో 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసు కునేలా అవగాహన కల్పించాలన్నారు. సదస్సులో డిప్యూటీ తహశీల్దార్ శ్రీనాథ్, ఆర్ఐ నాగిరెడ్డి, ఐదుగురు సూపర్వైజర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎఇఆర్ఒ సుమతి

ఓటరు నమోదును వినియోగించుకోండి

కళ్యాణదుర్గం రూరల్ : ఈ నెల 23, 24 తేదీల్లో నిర్వహించే ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని పట్టణ, మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ భాస్కర్ తెలిపారు. బూత్ స్థాయి అధికారులు వారి వారి పోలింగ్ కేంద్రాల్లో ప్రజలకు అందుబాటులో ఉండి దరఖాస్తులు స్వీకరించాలన్నారు.

దళితులకు భూమి దక్కేవరకూ పోరాటం

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

హత్యకు గురైన దళిత యువతి కుటుంబానికి భూమి దక్కేంత వరకూ పోరాటం చేస్తామని ఎస్సీ, ఎస్టీ సంఘాల జెఎసి రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని కార్యాలయంలో తహశీల్దార్ పుణ్యవతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019లో దళిత యువతి స్నేహలతను అత్యంత కిరాతకంగా హత్య చేశారన్నారు. హత్య చేసిన దుర్మార్గులను కఠినంగా శిక్షించాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కుల, ప్రజాసంఘాలు పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తే స్పందించిన ప్రభుత్వం మండలంలోని సిద్దరాంపురం గ్రామం సర్వే నంబర్ 188-1బిలో ఐదెకరాల ప్రభుత్వ భూమిని మృతురాలి తల్లి మాదిగ లక్ష్మీదేవి పేరుపై డీ పట్టా పాసు పుస్తకం ఇచ్చారన్నారు. అయితే ఈ భూమి శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీకి సంబంధించిందని వెటర్నరీ అధికారులు అడ్డుకుంటున్నారన్నారు. ఈ విషయమై పలుమార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. వెంటనే బాధిత కుటుంబానికి భూమి అప్పగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి నారాయణస్వామి, పూసల సంఘం జిల్లా అధ్యక్షుడు హనుమంతు, సమతా సైనిక్‌దళ్ జిల్లా అధ్యక్షులు సుగమంచి శ్రీనివాసులు, జెఎసి నాయకులు భాస్కర్, రామకృష్ణ, నారాయణస్వామి, దిలీప్, బాధితులు కుళ్లాయప్ప, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

చిన్నారి వైద్య ఖర్చులకు ఆర్థికసాయం



ఆర్థికసాయం అందిస్తున్న బద్దేనాయక్

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

ఓ చిన్నారి వైద్య ఖర్చులకు ఇన్ఫినిటీ ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్, ప్రభుత్వ ఉపాధ్యాయులు బద్దేనాయక్, మిత్రులతో కలిసి శుక్రవారం రూ. 20 వేలు అందజేశారు. వివరాలు.. పట్టణానికి చెందిన దామోదర్, లత దంపతులు సౌభాగ్య థియేటర్ సమీపంలో పిండి మిషన్ నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. వారికి కుమారుడు, కుమార్తె సంతానం. కూమార్తె లిఖిత రెండో తరగతి చదువుతోంది. డెంగీ జ్వరం బారిన పడడంతో పది రోజులుగా అనంతపురంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. అక్కడి వైద్యులు మెరుగైన చికిత్స కోసం బెంగళూరుకు సిఫారసు చేశారు. వారి ఆర్థిక పరిస్థితి తెలుసుకున్న ఇన్ఫినిటీ ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ బద్దేనాయక్ రూ. 10 వేలు, ఆయన మిత్రులు సురేష్ రూ. 5వేలు, హరీష్ రూ. 5వేలు చొప్పున మొత్తం రూ. 20వేలను బాలిక చిన్నాన్న పురుషోత్తంకు అందజేశారు. కార్యక్రమంలో పట్టణ యువకులు రుహల్లా, ప్రకాష్, ట్రస్ట్ వైస్ ఛైర్మన్ సురేష్, కార్యదర్శి హరీష్, ప్రకాష్, సభ్యులు తిప్పేస్వామి పాల్గొన్నారు.

ఉరుసు మహోత్సవంలో గుర్రం స్వారీ

బొమ్మనహాల్ : మండలంలోని డి.హొన్నూరు గ్రామంలో వెలసిన శర్మాస్‌వలి దర్గా ఉరుసు మహోత్సవం నాలు గు రోజుల నుంచి జరుగుతోంది. ఈ క్రమంలో శుక్రవారం గుర్రం స్వారీ కారక్రమం నిర్వహించినట్లు ముతవల్లి రహంతుల్లా తెలిపారు.

రాతిదూలం లాగుడు పోటీలు

ఉరుసు మహోత్సవం సందర్భంగా నిర్వహించిన ఎద్దుల రాతిదూలం లాగుడు పోటీలు హోరా హోరీగా సాగాయి. పోటీల్లో కలేకుర్తి సురేంద్ర ఎద్దులు విజేతగా నిలిచి రూ. 15 వేలు దక్కించుకున్నారు. బోయ చందు, బోయ గౌరీ వీరేష్, వన్నూరు స్వామి ఎద్దులు 2, 3, 4 స్థానాల్లో నిలవగా వరుసగా రూ. 10 వేలు, రూ. 8 వేలు, రూ. 5వేలు అందజేశారు. మాజీ సర్పంచి కేశవ రూ. 15వేలు, కేశవ సోదరుడు హనుమంతు రూ. 10వేలు, మాజీ ఎంపీటీసీ ఆనంద్, వారి మిత్రులు నగదు అందజేశారు.

మినీ గోకులాల నిర్మాణాలు పరిశీలన

పుట్లూరు : మండల పరిధిలోని కంది కాపుల, పుట్లూరు పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం కింద నిర్మిస్తున్న మినీ గోకులాల నిర్మాణాలను ఎపిడి విజయ్‌కుమార్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మినీ గోకులాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ చెన్నకేశవులు, ఈసీ విజయనాగేంద్రరెడ్డి, టీఏ వెంగల్‌రెడ్డి, బిఎఫ్‌టి రామాంజనేయరెడ్డి, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

దొంగల బెడద నుంచి కాపాడాలని వినతి

పామిడి : దొంగల నుంచి రైతులను కాపాడాలని కోరుతూ ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు సాకే గోవిందు శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సిఐ యుగంధర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొద్దిరోజుల నుంచి పామిడి పరిసర ప్రాంతాల్లో రైతులకు సంబంధించిన మోటార్లు, వైర్లు, పైపులు, స్టార్టర్‌బాక్సులు దొంగలు ఎత్తుకెళు న్నారన్నారు. కావున దొంగలను పట్టుకుని రైతులను ఆదుకోవాలని కోరారు.

ఘనంగా గణపతి, సుబ్రమణ్యస్వామి విగ్రహాల ప్రతిష్టాపన

నార్పల : మండల కేంద్రంలోని తికయ్య స్వామి ఆలయ ఆవరణలో శుక్రవారం వేదమంత్రాల సాక్షిగా గణపతి, సుబ్రమణ్వేశ్వర స్వాముల విగ్రహాలను ఘనంగా ప్రతిష్టించారు. ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నార్పల సత్యనారాయణరెడ్డి, మాజీ సర్పంచి స్వాతిలతారెడ్డి, ప్రముఖ చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి సభ్యత్వ నమోదు

అనంతపురం రూరల్ : నగరంలోని అర్బన్ నియోజకవర్గ కార్యాలయంలో శుక్రవారం టిడిపి సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని పార్టీ పరిశీలకులు లక్ష్మీనారాయణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ టిడిపి సభ్యత్వ నమోదును బాధ్యతగా తీసుకోవాలన్నారు. సభ్యత్వ నమోదు చేసుకుంటే అనేక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మాజీ మేయర్ స్వరూప, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుగ్గయ్య చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

పెద్దాసుపత్రి వద్ద అన్నదానం

అనంతపురం : నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు 'పుట్టినిల్లు' ఆశ్రమం ఆధ్వర్యంలో అనంతపురంలోని పెద్దాసుపత్రి వద్ద పేదలకు శుక్రవారం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు ఛైర్‌పర్సన్ నిర్మలమురళి మాట్లాడుతూ ట్రస్టు సభ్యులు, తమ తమ్ముడు తిరుపతినాయుడు కుమార్తె దియాన్షీ పుట్టినరోజు సందర్భంగా అన్నదానానికి సహకరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు హరిప్రియ, జయలక్ష్మి, సందీప్, శశాంక్, జశ్విన్, గంగోత్రి, సుబ్రమణ్యం, ఓబుళపతి రవికుమార్, నల్లప్ప, మణిదీప్, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

విత్తన వేరుశనగ పంపిణీ

బహ్మసముద్రం : మండలంలోని భైరవానితిప్ప పంచాయతీకి చెందిన పోలేపల్లి గ్రామంలో శుక్రవారం విత్తన వేరుశనగ పంపిణీ చేసినట్లు అగ్రికల్ అసిస్టెంట్స్ సాయితేజ, నవీన్ తెలిపారు. కురి మల్లి ఆధ్వర్యంలో రబీ పంట కాలానికి సంబంధించిన విత్తన వేరుశనగను రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రైతులు, తదితరులు పాల్గొన్నారు.

చట్టంపై అవగాహన కల్పించాలి

రాయదుర్గం రూరల్ : పని ప్రదేశంలో లైంగిక వేధింపుల రక్షణ కోసం ఏర్పాటు చేసిన చట్టంపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని ఎంపిడిఓ కొండన్న సూచించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం లైంగిక వేధింపుల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సిడిపిఒ పద్మావతి మాట్లాడుతూ పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల రక్షణ కోసం(సెక్సువల్ హరాస్‌మెంట్ ఆఫ్ ఉమెన్ అండ్ వర్క్ ప్లేస్) చట్టాన్ని సద్వినియోగం చేసుకునేలా మేల్కొల్పాలి అన్నారు. రీసెర్చ్ పర్సన్ డివి యాక్ట్, సోషల్ మీడి యా కౌన్సిలర్ ఉమాదేవి కేసు పూర్వాపరాలు, నిర్వచనం పరిధి, స్థానిక ఫిర్యాదుల కమిటీ ఏర్పాటు, ఫిర్యాదుల వివరణ, రిపోర్ట్‌పై సమగ్రంగా వివరించారు. కార్యక్రమంలో రెవెన్యూ, పోలీస్, ఆరోగ్య, ఐసిడిఎస్ శాఖల అధికారులు పాల్గొన్నారు.